# వాగ్దానం

-వి.ఉమశ్రీ

"అత్తయ్యా! వక్కపొడి ఎక్కడుంది?" అంటూ హాల్లో ఏదో సర్దుతున్న మేనత్తని అడిగింది సుమ.

"కిచెన్‌లో పైన వున్నట్టుంది చూడు" అంది కామేశ్వరి.

"తొందర్లో ఈ ఇంటి కోడలు కాబోతున్నావు. ఏ వస్తువులు ఎక్కడున్నాయో తెలుసుకోవాలే పిల్లా" అంటూ మనవరాలితో పరాచికాలాడింది అక్కడే వున్న అన్నపూర్ణమ్మగారు.

"అత్తయ్యా! ఇప్పుడంటే అన్నారుగానీ ఇంకెప్పుడూ ఇలా అనకండి" అన్నాడు శివశంకరం.

"అదేమిటండీ మనం మొదట్నుంచీ అనుకున్నదేగా? ఇవాళ్ల కొత్తగా అన్నదేముంది?"

"అవుననుకోండి. అయినా హరికి ఇష్టమో కాదో తెలుసుకోవాలిగా."

"నా మనవడు నా మాటెప్పుడూ కాదనడు. వాడు చేసుకోవడానికి రెడీగానే వున్నాడు. ఇక ముహూర్తాలు పెట్టడమే ఆలస్యం" అంది మనవడి మనసులోని మాటను ముందే తెలుసుకున్న అన్నపూర్ణమ్మగారు.

"వాడి ఇష్టాన్ని పక్కన పెట్టండి. అసలింతకీ వాళ్ళు కట్నం ఏ రేంజి వరకు తూగగలరు అన్నదే నా అనుమానం" అన్నాడు కొద్దిగా విసుగ్గా.

అల్లుడి మనసులో మాటను తెల్సుకున్న అన్నపూర్ణమ్మగారు ఇక మారు మాట్లాడలేదు.

★★★

అన్నపూర్ణమ్మగారికి ఇద్దరే సంతానం. కొడుక్కి ఇద్దరు కూతుళ్లు కాగా, కూతురికి ఇద్దరూ కొడుకులే. పెద్ద మనవరాలు శ్యామలకు మంచి సంబంధం చూసే పెళ్లి చేసారు. ఇక చిన్న మనవరాలు సుమను మాత్రం మేనత్త కొడుక్కిచ్చి చేద్దామని చిన్నప్పటినుంచీ అనుకున్నదే. కానీ ఈమధ్య అల్లుడు శివశంకరానికి అదృష్టం కలిసొచ్చింది. ఆస్తిపాస్తులు రెట్టింపు అవడంతో ధనాశ మరింత పెరిగింది. అతని పెద్దకొడుకు రమేష్ బిటెక్ చేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సంవత్సరం క్రితమే ఎక్సయిజ్ కమీషనర్‌గారి కూతురితో అతని పెళ్లయింది. ఇక చిన్నకొడుకు హరి మెడిసిన్ చేసి లండన్‌లో వుంటున్నాడు. చిన్నప్పటినుంచీ అనుకున్నదే అయినా శివశంకరంకి ఇప్పుడు స్టేటస్ పెరిగినప్పటికీ బావమరిదితో వియ్యమందుకోవడానికి అతని మనసు అంగీకరించడంలేదు. అలా అని అత్తగారితో ఖరాఖండీగా వద్దని చెప్పనూలేడు. అతను కొత్తగా కట్టించిన మరో డ్యూప్లెక్స్ హౌస్ గృహప్రవేశం గురించే అందరూ వచ్చారు. రెండురోజుల తరువాత ఎవరిళ్లకు వాళ్ళు వెళ్లిపోయారు.

★★★

"మీ బావకి మన సంబంధం కలుపుకోవడం ఇష్టం లేనట్టుందిరా అబ్బాయ్" అంది అన్నపూర్ణమ్మగారు.

"అదేంటి? ఏమైందమ్మా అసలు?" అర్థం కానట్టు అడిగాడు రామ్మూర్తి.

"అవునండీ. నేను కూడా విన్నాను. మొన్న గృహ ప్రవేశం రోజున అత్తయ్యగారు ఏదో సరదాగా అంటే అన్నయ్యగారు చాలా సీరియస్ అయిపోయారు. అదీగాక వాళ్ల కట్నం ఏమాత్రం ఇచ్చుకోగలరు? అన్నట్లు మాట్లాడారు. నాకు చాలా బాధేసింది" అంటూ కిచెన్‌లోంచి హాల్లోకి వచ్చింది రాజ్యలక్ష్మి.

"పోనీ ఓ మంచిరోజు చూసి బావగారితో మాట్లాడి వస్తాను. వాళ్ళడిగినంత మనం ఇవ్వగలిగితే భాయపర్చుకుందాం. లేదంటే ఎక్కడైనా మరో సంబంధం చూద్దాం. దేశం గొడ్డు పోలేదుకదా పెళ్లి కొడుకులు దొరక్కపోవడానికి" అన్నాడు రామ్మూర్తి అసహనంగా.

"ఏం అక్కర్లేదు నాన్నా. మీరేం వెళ్లి అడగొద్దు. గుళ్ళో పూజారినైనా చేసుకుంటానుగానీ బావని మాత్రం చేసుకోను. మరీ ఇంత డబ్బు కక్కుర్తి ఉన్న వాళ్ళు మనకి అక్కర్లేదు" అంది సుమ.

"సుమా! నువ్వూరుకో. చిన్నంతరం పెద్దంతరం లేకుండా ఏమిటా మాటలు? అనవసరపు విషయాల్లో నువ్వు జోక్యం చేసుకోవద్దు. వెళ్లి నీ పని నువ్వు చూసుకో" అంటూ కూతుర్ని కోప్పడింది రాజ్యలక్ష్మి.

సుమకి ఇష్టం లేక కాదు. చిన్నప్పట్నుంచీ బావ మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఏ నాటికైనా బావ తనవాడేనని నమ్మింది. కానీ మొన్న మామయ్య మాటలు వినేసరికి ఆమెకు కూడా కోపంతోపాటు దుఃఖం కట్టలు తెంచుకువచ్చింది. మామయ్య ఆశించినంత కట్నం తన తండ్రి జన్మెత్తినా ఇవ్వలేడు. అలా అని బావని వదులుకోవడానికి ఆమె సిద్ధంగా లేదు. ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో తల్లి కోప్పడేసరికి ఏడుస్తూ తన గదిలోకి వెళ్లిపోయింది. కనీసం నాలుగు లక్షలైనా ఇవ్వందే సంబంధం కలుపుకోనని శివశంకరం గట్టిగా చెప్పేటప్పటికి వరుని వేటలో పడ్డాడు రామ్మూర్తి.

'నడమంత్రపుసిరి' అంటూ గొణుక్కుంది అన్నపూర్ణమ్మగారు.

★★★

కాలచక్రంలో మరో ఆరునెలలు గిర్రున తిరిగిపోయాయి. ఆ రోజు సంక్రాంతి పండుగ. పెద్ద కూతురు శ్యామల పాపతో పుట్టింటికి రావడంతో అందరూ చిన్నపాప ఆటపాటలతో సంతోషంగా వున్నారు. అప్పుడే కబురొచ్చింది 'కామేశ్వరికి యాక్సిడెంట్ అయింది, హాస్పిటల్‌లో జాయిన్ చేసామంటూ!' అంతే! అందరూ ఎక్కడివక్కడ వదిలేసి హాస్పిటల్‌కు పరుగెత్తారు.

అన్నపూర్ణమ్మగారైతే కూతుర్ని బెడ్‌మీద చూడగానే భోరుమంది. ఒక నెలరోజుల తరువాత కామేశ్వరిని ఇంటికి తీసుకువచ్చారు. అయితే ఇప్పుడామె వికలాంగురాలు. తనకు జరిగిన కష్టాన్ని తల్చుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్న ఆమెను ఆపడం ఎవరి తరమూ కాలేదు. తల్లికి జరిగిన యాక్సిడెంట్ విషయం తెలుసుకుని హుటాహుటిన బయలుదేరి వచ్చారు కొడుకులిద్దరూ. ఒకరోజు సాయంత్రం పెరట్లో తన తండ్రికి, మామయ్యకి జరిగిన సంభాషణ, మామయ్య సుమకి పరాయి సంబంధం చూస్తున్నాడనీ అన్నీ పూస గుచ్చినట్లు చెప్పింది అన్నపూర్ణమ్మగారు మనవడితో.

జరిగిందంతా విని హరి చాలా బాధపడ్డాడు. ఎల్లాగైనా సరే ధనదాహంతో ఉన్న తన తండ్రి కళ్ళు తెరిపించాలనుకున్నాడు. ఇదేమీ తెలియని శివశంకరం భార్య అవిటిదైపోయేటప్పటికి కళ్ళు క్రిందకు దిగి ఇంట్లో చాకిరీ చేయడానికి పరాయి పిల్ల కన్నా అయిన సంబంధం అయితేనే మంచిదనుకుని ప్లేటు ఫిరాయించాడు. ఒకవేళ సుమ పెళ్లయి హరితో లండన్ వెళ్లిపోయినా పిల్లనిచ్చిన పాపానికి రామ్మూర్తి దంపతులైనా తన భార్యకి, తనకి సహాయంగా ఉంటారని ఆయన అభిప్రాయం.

★★★

"ఏరా హరీ! మళ్ళీ నువ్వు ఎప్పుడు వెళ్లాలి?"

"ఎందుకు నాన్నా!"

"ఆ... ఏంలేదు. మామయ్య కూతురితో నీకు ఆ మూడు ముళ్ళు వేయించేస్తే మా బాధ్యత తీరిపోతుంది!"

"లేదు లేదు. నేను లండన్‌లో ఓ నేపాలీ అమ్మా

యిని ప్రేమించాను. ఆమెనే చేసుకుంటాను.''

"అదేమిట్రా అలా మాట్లాడతావ్? మామయ్యకి మేమిచ్చిన మాట ఏం కాను?'' అన్నాడు శివశంకరం.

"ఎవరిమ్మన్నారు నాన్నా మాటని. నేను చెప్పానా మీకు సుమని చేసుకుంటానని? నన్ను అడక్కుండా మీలో మీరే మాట ఇచ్చేసుకుని ఆపైన నన్ను ఇబ్బంది పెడతారేంటి?'' అన్నాడు అక్కడే వున్న అమ్మమ్మకి కన్ను గీటుతూ.

"అదికాదురా. అన్నయ్య అమెరికా, నువ్వు లండన్ అలా మీ పెళ్లాలతో మీరు వెళ్లిపోతే మా గతేంకాను? మమ్మల్ని చూసే దిక్కెవ్వరు?'' కళ్లనీళ్లతో అంది కామేశ్వరి.

"ఏమో? అవన్నీ నాకేం తెలుసు? మీ ఆయన్ని అడుగు'' అంటూ కొంచెం పొగరు నటించాడు హరి. కొడుకు మాటలు విని ఇక తన అన్నయ్య కూడా తనకి దూరమవుతాడని చాలా బాధపడింది కామేశ్వరి.

★★★

ఒక మంచి రోజు చూసి మామయ్య కుటుంబాన్ని తమ ఇంటికి ఆహ్వానించాడు హరి, అమ్మమ్మ సహకారంతో. ఆనవాయితీ ప్రకారం వీళ్లే వాళ్లింటికి వెళ్లాల్సి వున్నా తల్లి నడవలేని పరిస్థితి కారణంగా ఇలా చేసాడు. అనుకోకుండా అందరూ వచ్చేసరికి కారణం అర్థం కాలేదు శివశంకరానికి.

ఈలోపు ఇంటి పురోహితుడు కూడా వచ్చేసాడు. పురోహితుడ్ని చూడగానే జరగబోయేది గ్రహించి "ఒరేయ్ హరీ! ఏమిటిదంతా?'' అర్థంకాక కొడుకుని అడిగాడు.

"నాన్నా! నేను సుమని పెళ్లి చేసుకోబోతున్నాను. ఈరోజే నిశ్చయ తాంబూలాలు. అందుకే మామయ్యవాళ్లని నేనే వెళ్లి స్వయంగా మనింటికి తీసుకువచ్చాను. చాలా... ఇంకేమన్నా కావాలా?''

"అది కాదురా. మొన్న నువ్వు ఎవరో నేపాలీ అమ్మాయిని...''

"అదంతా వట్టి నాటకం నాన్నా. నువ్వు మనింటికి గృహప్రవేశం రోజున అన్న మాటల దగ్గర్నుండి ఈ రోజువరకు జరిగిందంతా అమ్మమ్మ నాకు చెప్పింది. నేను అలా మాట్లాడితే మీ ఫీలింగ్స్ ఎలా ఉంటాయోనని కావాలనే చిన్న నాటకం ఆడాను.

చూడండి నాన్నా! ఆడిన మాట తప్పనివారు చరిత్రలో చిరస్థాయిగా గుర్తుండిపోతారు. ఆడిన మాట తప్పే అలవాటులేని బలి చక్రవర్తి తాను పాతాళంలోకి కుంగిపోతున్నా తనిచ్చిన మాటని మాత్రం అంబరాన నిలిపి ఉంచాడు. ప్రాణాలకు ముప్పని తెలిసి కూడా మాట నిలుపుకోవడానికి కవచ కుండలాలను కోసి ఇచ్చాడు కర్ణుడు. మన ప్రవర్తన అద్దంలాంటిది నాన్నా. ప్రతి మనిషి వ్యక్తిత్వం అందులో తెలుస్తుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నవాళ్ళను అందరూ గౌరవిస్తారు. గోడ మీద పిల్లి వాటంగా ఉండి అవసరాన్నిబట్టి ప్రవర్తించే అవకాశవాదులను ఎవ్వరైనా దూరంగా ఉంచుతారు. నాన్నా! నేను మీకు చెప్పేంతవాడ్ని కాదుకానీ పదిమందితో సత్సంబంధాలు నెలకొల్పుకోవాలంటే మాటకీ, చేతకీ పొంతన ఉండాలి. మీమీద నమ్మకంతో మరో మార్గమేదీ ఆలోచించక నిశ్చింతగా ఉన్న వ్యక్తికి ఒక్కసారిగా మీరు మాట తప్పితే ఇక జన్మలో మీ మీద నమ్మకం ఉండదు. మాట నిలబెట్టుకోవడం విలువలు పాటించే వ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ విషయంలో కొద్దిపాటి నిర్లక్ష్యం చేశామంటే అదే బంధువుల మధ్య శాశ్వత ఎడబాటును సృష్టిస్తుంది'' అంటూ చిన్న లెక్చరిచ్చాడు.




శివశంకరంతోపాటు అక్కడున్నవాళ్లందరూ నిశ్చేష్టులై హరివంకే చూస్తూ ఉండిపోయారు.

"ఆ... ఇక తాంబూలాల కార్యక్రమం మొదలు పెడదాం. ఆ తరువాత వర్జ్యం వచ్చేస్తుంది'' పురోహితుడి కేకతో అందరూ వర్తమానంలోకి వచ్చారు.

"నా బావ నాకే సొంతం'' అనుకుంటూ తృప్తిగా గాలి పీల్చుకుంది సుమ!

★